ఆంధ్రజ్యోతి



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 : కనిష్ఠం 20.4
కామారెడ్డి జిల్లా వార్తలు

మంగళవారం 24 సెప్టెంబరు 2024

పార్ట్‌టైమ్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు23: ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్‌లో పార్ట్ టైమ్ టీచర్ల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో పీజీటీ మ్యాథ్స్ పిజీటీ కెమిస్ట్రీ, పీజీటీ బాటని, పిజీటీ కామర్స్, టీజీటీ ఇంగ్లీష్, టీజీటీ సైన్స్ టీజీటీ సోషల్‌సబ్జెక్టులకు ఖాళీల ఉన్నాయని పేర్కొన్నారు. పీజీటీలో సంబంధిత సబ్జెక్టులో పీజీ బీఈడీ, టీజీటీకీ డిగ్రీతో పాటు బీఈడీ చేసినవారు అర్హులని తెలిపారు. ఈనెల 28వరకు పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. డెమో తర్వాత నియామకం ఉంటుందని తెలిపారు.

- జిల్లాలో అధ్వానంగా ప్రధాన ప్రాజెక్టుల కాల్వలు
- చెట్ల పొదలు, పూడికతో కూరుకుపోయిన డిస్ట్రిబ్యూటర్ కాల్వలు
- పలుచోట్ల కాల్వలకు గండ్లు
- ప్రాజెక్టుల నుంచి నీటిని వదిలినా పంటలకు చేరని పరిస్థితి
- కిలోమీటర్ల పొడవునా ప్రధాన ప్రాజెక్టుల కాల్వలు
- మరమ్మతులకు నోచుకోని నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్టుల కాల్వలు
- నిధులున్నా కాల్వల మరమ్మతులు కరువు
- జిల్లాలో నిండిన ప్రధాన ప్రాజెక్టులు



కాల్వలు ఇలా.. నీరు పారేదెలా?

కామారెడ్డి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో ఆలస్యంగానైన భారీవర్షాలు కురువడంతో ప్రధాన ప్రాజెక్టులు, చెరువులు, కుంటలోకి భారీగా వరదవచ్చి చేరింది. ప్రధాన ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండుకోవడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. చెరువులన్ని అలుగులు దూకుతున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు నిండుకుండల మారాయి. ఈ యేడు జిల్లాలో 5.47 లక్షల ఎకరాలలో వరి, మొక్కజొన్న, సోయా, పత్తి, ఇతర పప్పుదినుసు పంటలు సాగుచేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన నిజాంసాగర్, పోచారం, కౌలాస్ పరిధిలోని ఆయాకట్టుక్రింద లక్షల ఎకరాలలో వరిసాగవుతుంది. అయితే ఆ ప్రాజెక్టుల, చెరువుల కాల్వలు సరిగా లేకపోవడంతో చివరివరకు నీరందుతుందో లేదోననే ఆందోళన రైతుల్లో కన్పిస్తోంది. ఏటా వానాకాలం ఆరంభంలో కాల్వలకు మరమ్మతులు చేసే నీటిపారుదల శాఖ అధికారులు గ త నాలుగేళ్లుగా మరిచిపోయారు. తాత్కలిక పనులతోనే సరిపెడుతున్నారు.

నిండిన జలాశయాలు

జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలకు ప్రధాన ప్రాజెక్టులైన నిజాంసాగర్, కౌలాస్, పోచారంలు పూర్తి స్థాయిలో నిండాయి. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 16.470 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. ఈ సీజన్లో ప్రాజెక్ట్ గేట్లను పలుమార్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. కౌలాస్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.237 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.237 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. పోచారం ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.820 టీఎంసీలలో నిల్వ ఉంది. ఈ రెండు ప్రాజెక్టులు సైతం నిండుకోవడంతో పలుమార్లు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు.దీంతో పాటు ఈ ప్రాజెక్టుల ప్రధాన కాల్వలకు సైతం నీరు విడుదలచేస్తూ అయకట్టు పంటలకు నీటిని సరాఫరా చేస్తున్నారు.






కౌలాస్‌నాలా ప్రాజెక్ట్ డీ5 కెనాల్‌లో మొలచిన జెనిగాలం గడ్డి, తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలు



నిజాంసాగర్ ప్రాజెక్ట్ ప్రధానకాలువ, 25వ డిస్ట్రిబ్యూటర్స్, సబ్‌కెనాల్స్ పరిస్థితి



ప్రధాన ప్రాజెక్టుల ఆయకట్టు 80వేల ఎకరాలకు పైగానే..

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రధాన ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజె క్టుల పరిధిలో సుమారు 80 వేల ఎకరాలకు పైగానే ఆయాకట్టు ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సాగునీరు అందిస్తోంది. ఈ ప్రాజెక్ట్ క్రింద ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు లక్ష ఎకరాలకు పైగానే ఆయాకట్టు ఉంది. కామారెడ్డి జిల్లా పరిధిలో 46,868 ఎకరాలలో సాగునీటిని అందిస్తోంది. ప్రధానంగా నిజాంసాగర్, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూర్, నస్రూళ్లబాద్ మండలాల్లోని రైతుల పంటలకు సాగునీరు ఈ ప్రాజెక్ట్ ద్వారా రెండు సీజన్‌లకు అందిస్తుంటారు. పోచారం ప్రాజెక్ట్‌కు సైతం 17వేల 401 ఎకరాలలో ఆయాకట్టు ఉంది. కౌలాస్ నాలా ప్రాజెక్ట్‌కు 9వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించి ఆయకట్టుకు అందించేందుకు ప్రధాన కాల్వలతోపాటు డిస్ట్రిబ్యూటర్ కాల్వలు సైతం ఉన్నాయి.

కూరుకున్న కాల్వలు.. పలుచోట్ల గండ్లు

జిల్లాలోని నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టులతో పాటు ప్రధాన చెరువులకు సుమారు లక్షకు పైగానే ఆయాకట్టు ఉంది. ఈ జలవనరులకు సంబంధించిన కాల్వల ద్వారా ప్రతీ ఏటా రెండు సీజన్‌లలో ఆయకట్టు రైతులకు సాగునీటిని అందిస్తుంటారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన కాల్వ, కామారెడ్డి జిల్లాలో 49 కి.మీ. పరిధిలో విస్తరించి ఉంది. ఈ ప్రధానకాల్వకు డిస్ట్రిబ్యూటర్ కెనాల్ సైతం ఉన్నాయి. ప్రధాన కాల్వ మరమ్మతులు జరుగుతున్నా డిస్ట్రిబ్యూటర్ కెనాల్ మరమ్మతలు జరగడం లేదు. 100 ఏండ్ల చరిత్ర ఉన్న పోచారం ప్రాజెక్టుకు సైతం ప్రధానకాలువ లేకపోయింది. ప్రధాన కాల్వ ఏర్పాటుకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదించిన తవ్వకాలకు అనుమతి రాలేదు. ఈప్రాజెక్ట్ ద్వారా నాగిరెడ్డిపేటతోపాటు ఎల్లారెడ్డి మండలాల్లో వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.కౌలాస్ నాలా ప్రాజెక్ట్ ద్వారా జుక్కల్,పిట్లం,బిచ్కుంద మండలాల్లోని 9 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టుకు సైతం ప్రధాన కాల్వ ఉండగా డిస్ట్రిబ్యూటర్ కెనాల్‌లు ఉన్నాయి. ఈ ప్రధాన కాల్వలకు సంబంధించిన కాల్వలు ప్రస్తుతం చెట్ల పొదలు, మట్టితో కురుకుపోయాయి. పలు చోట్ల కాల్వలకు గండ్లు పడ్డాయి.మరికొన్ని కాల్వలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తే పంట పొలాలకు చేరలేని పరిస్థితికి కాల్వలు చేరుకున్నాయని రైతులు చెబుతున్నారు.

నిధులున్నా మరమ్మతు పనులు కరువు

జిల్లాలోని నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్టుల ప్రధాన కాల్వలతో పాటు డిస్ట్రిబ్యూటర్ కాల్వల మరమ్మతు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్న పనులు మాత్రం అంతంతమాత్రంగానే జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నిజాంసాగర్ ప్రధాన కాల్వతో పాటు అనుసంధాన కాల్వల మరమ్మతులు, పూడిక తీలగించేందుకు నీటి పారుదల శాఖకు నిధులు మంజూరు చేసింది.మిగిలిన ప్రధాన కాల్వల ఆధునికరణ పనులు ఐదేండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. డిస్ట్రిబ్యూటర్ కెనాల్‌ల మరమ్మతులకు ఉపాధిహామీతో పాటు వివిధ పథకాల క్రింద నిధులు మంజూరు చేసినట్లు సంబంధిత శాఖ రికార్డులు చెబుతునప్పటికి క్షేత్రస్థాయిలో మాత్రం కాల్వల పరిస్థితి భిన్నంగా ఉంటుంది. నిధులు ఖర్చుచేసి కాల్వల మరమ్మతుల పనులు చేసి పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



• ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు (ఫైల్)

ప్రైవేట్ ఆసుపత్రుల ఆగడాలకు
అడ్డుకట్ట పడేనా?

- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు
- ఆసుపత్రికి వచ్చిన క్షతగాత్రుడిపై దాడి
- తలకు గాయమైందని ఆసుపత్రికి వచ్చిన క్షతగాత్రుడు
- డబ్బుల చెల్లింపులో వాగ్వాదం.. కుట్లు తీసి పంపేసిన వైనం
- ఎన్ని ఫిర్యాదులు చేసినా చర్యలు అంతంతే..
- ప్రైవేట్ ఆసుపత్రుల దౌర్జన్యంపై వైద్యఆరోగ్యశాఖ చర్యలు తీసుకునేనా?

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు23: కామారెడ్డి జిల్లాలో పలు ప్రైవేట్ ఆసుపత్రుల దౌర్జన్యానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిన్నమొన్నటి వరకు ఏ చికిత్సకు ఏ ధర అనేది తెలుపకుండా దోపిడీకి పాల్పడడం, డెంగ్యూలాంటి ప్రాణాంతక వ్యాధులను ఇష్టారీతిన పాజిటివ్‌గా తమ సొంత ల్యాబ్‌లు, కమీషన్‌లు ఇచ్చేవాటిలో నిర్ధారణ చేయిస్తూ వచ్చిన పలు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఇప్పుడు ఏకంగా ప్రజలు ఏ పరిస్థితిలో ఉంటే మాకేంటి మాకు డబ్బులు మాత్రమే ముఖ్యమనే రీతిలో వ్యవహరిస్తున్నారు. చివరికి చికిత్స కోసం వచ్చిన వారిపై దాడులకు పాల్పడే స్థాయికి చేరుకున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా వైద్యఆరోగ్యశాఖ చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చికిత్స కోసం వచ్చిన క్షతగాత్రుడిపైనే ఆసుపత్రి సిబ్బంది దాడి

జిల్లాకేంద్రంలో నివాసం ఉండే శ్రీను అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదివారం రాత్రి నిజాంసాగర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చాడు. చికిత్సలో భాగంగా తలకు కుట్లు వేశారు. డబ్బుల చెల్లింపు విషయంలో వాగ్వాదం జరిగింది. దీంతో ఆసుపత్రి సిబ్బంది ఏకంగా క్షతగాత్రుడికి వచ్చిన కుట్లను అప్పటికప్పుడే తీసేసి ఆసుపత్రి బయటకు పంపించేశారు. దీంతో బాధితుడు ఆయన కుటుంబీకులు, స్నేహితులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న వారు ఆందోళన చేశారు. ఈ రకంగా వ్యవహరిస్తున్న ఆసుపత్రి సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ భర్తకు ఈ విషయం తెలుపడంతో ఆయన సైతం అక్కడికి చేరుకుని ఆసుపత్రి యాజమాన్యం తీరు, సిబ్బంది ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రమాదబారిన పడిన వ్యక్తిని ఈ రకంగా ట్రిట్‌చేయడంపై ఉన్నతాధికారులు సమగ్రవిచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కోన్నారు.

ఆసుపత్రులు, ల్యాబ్‌ల పనితీరుపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు అంతంతే..

ప్రజలకు చికిత్సలో ఎక్కడైనా అన్యాయం జరిగితే ఫిర్యాదులు చేస్తే తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్తున్న వైద్యఆరోగ్యశాఖ అధికారుల ప్రకటనలు కేవలం మాటలకే తప్ప చేతలలో కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రులలో ఏ చికిత్సకు ఎంత ధరలు అనే బోర్డులు ఏర్పాటుచేసి అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా పూర్తిస్థాయి విచారణ మాత్రం చేపట్టడం లేదు. టీ హబ్‌లో నిర్ధారణ అయిన తర్వాతే డెంగీ కేసులకు చికిత్సలు అందించాలని ఆదేశించామని చెప్పిన ఆ ఆదేశాలను ప్రైవేట్ ఆసుపత్రులు పట్టించుకుంటున్నాయా లేదా అనే అంశాలపై దృష్టిసారించడం లేదు. దీంతో వారికి నచ్చిన విధంగా ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు వ్యవహరిస్తూ డెంగీ పేరుతో చికిత్సలు అందించి లక్షలు వసూలు చేస్తున్నారు. ఎవరైనా ఈ దందా ఎంటని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేయడం అవసరమైతే దాడులకు పాల్పడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇక ల్యాబ్‌ల పనితీరుపై ఫీర్యాదులు వచ్చిన అసలు చర్యలు అనేవి తీసుకోవడం లేదు. ఇటీవల సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లికి చెందిన ఓ బాధితుడు తన కూతురుకి డెంగీ లేకున్న డెంగీ అని పాజిటివ్‌గా రిపోర్టు ఇవ్వడం పట్ల ఫిర్యాదుచేస్తే ఆ ల్యాబ్ నిర్వాహకునికి నోటీసులు అందించి నిర్వహకులు అందించిన వివరణతో గమ్మున ఉండిపోయారు. అసలు డెంగ్యు పాజిటివ్‌గా ఎలా ఇచ్చారని, బాలిక పరిస్థితి బాగానే ఉన్న మరో ఆసుపత్రికి రిఫర్‌చేసిన వైద్యుడి పనితీరుపట్ల ఎందుకు విచారణ జరపలేదనేది బాధితులకు అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. ఏదైనా సమస్య తలెత్తితే ఫిర్యాదు చేయాలని చెబుతున్నారే తప్ప బాధితులకు సరైన న్యాయం జరిగేలా మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు చేస్తున్న దౌర్జన్యాలు, తప్పుడు రిపోర్టులపై ఎవరైన బాధితులు ఫీర్యాదుచేస్తే వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు అందిస్తున్న నోటీసులపై ముడుపులు తీసుకుంటున్న కొంతమంది సిబ్బంది వారికి ఏ విధంగా వివరణ ఇవ్వాలనేది చెబుతున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ఓ ఆసుపత్రి లింగనిర్ధారణచేస్తుందనే విషయంపై సైతం జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయి చర్యలు తీసుకోవాలని చెబితే అందులోని చిన్న తప్పిదాలను ఆసుపత్రుల నిర్వాహకులకు వివరించి సీజ్ కాకుండా బయటపడే సలహాలు అం దించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజావాణికి వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలి

• కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



దరఖాస్తులను స్వీకరిస్తున్నకలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 23: ప్రజవాణికి వచ్చే అర్జీలను వెను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధ, వ్యక్తిగత తదితర సమస్యలపై ఆయా శాఖల అధికారులు స్పందించి పరిష్కారానికి కృషిచేయాలని అన్నారు. మొత్తం 120 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపరిచి వాటి పరిష్కారం,అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు.అదేవిధంగా బీబీపేట మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర హస్టల్‌లోని సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు అరుణ్ ఇదే విషయంపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.బీవీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి విఠల్ మాచారెడ్డి మండల కేంద్రంలో ఉన్నటువంటి ఎస్‌కేడీజీ పాఠశాల, నాగిరెడ్డిపేటలో ఉన్న కేరళ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా రేకులషెడ్‌లో కొనసాగుతుందని జీవో నంబర్ 1కి విరుద్ధంగా రేకుల షెడ్‌లో కొనసాగుతున్న, సరైన సౌకర్యాలు లేకున్నా విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్‌నాయక్,ఏవో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో..
ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం సందడి

బాంబే క్లాత్ హౌస్ ప్రారంభోత్సవానికి హాజరు

• వివరాలు 8లో..



రిబ్బన్ కట్ చేస్తున్న బ్రహ్మానందం, పక్కన కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి

విజయ డెయిరీ
పాల బకాయిలను చెల్లించాలి

- తాడ్వాయిలో ప్రధాన రహదారిపై రైతుల ఆందోళన
- రోడ్డుపై పాలు పారబోసి నిరసన



రోడ్డుపై కూర్చుని నిరసన తెలుపుతున్న రైతులు

తాడ్వాయి, సెప్టెంబరు23: విజయ డెయిరీ బకాయి ఉన్న పాల బిల్లులను తక్షణమే చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని తాడ్వాయి, ఎల్లారెడ్డి ప్రధానరహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రైతులకు బకాయిపడ్డ పాల బిల్లుల ను విడుదల చేయాలని అన్నారు. తాడ్వాయి, ఎర్రపహడ్ బీఎంసీలకు కలిపి సుమారు రూ.2కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలి నాలి చేసుకుని బతికే రైతులు జీవనాధరంగా పాడిని ఎంచుకుంటే ప్రభుత్వం ఇబ్బందుల పాలుచేయడం సరికాదని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారెంటీల్లో అన్నిరకాల వడ్లకు రూ.500 బొనస్ ఇస్తామని చెప్పి ప్రస్తుతం సన్నవడ్లకే ఇవ్వడం సరైంది కాదని అన్నారు. అనంతరం రోడ్లపై తెచ్చిన పాలను పారబోసి నిరసన తెలిపి తహసీల్దార్ రహిముద్దిన్‌కు వినతిపత్రం అందించారు. ఇందులో రైతు సంఘాల నాయకులు, మండల రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి 97 వినతులు

● వినతులను స్వీకరించిన కలెక్టర్

● సత్వరమే పరిష్కరించాలని

అధికారులకు ఆదేశం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 23: నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈవారం 97 వినతులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, అదనపు ఎస్పీ బస్వారెడ్డిలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడూ పరిశీలన జరుపుతూ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు వచ్చిన మునిపల్లి దళితులు..

జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామంలో దళితుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళితులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడు నచ్చన్న మాట్లాడుతూ మాదిగ కులానికి చెందిన తనకు ఎకరం భూమి ఉందని కానీ ఆ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసి శివలింగం ప్రతిష్ఠాపన చేశారని ఇదేమిటని అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. కొందరు రాజకీయ నేతలు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని 12 మందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామానికి చెందిన సుమారు 50 మంది దళిత ప్రతినిధులు కలెక్టరేట్‌కు వచ్చారు.



కలెక్టరేట్‌లో ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

పెన్షన్ ఇప్పించండి..

మోపాల్ మండలం చిన్నాపూర్‌కు చెందిన కమ్మయి రిషిత్ (9) తనకు పెన్షన్ ఇప్పించాలని కోరుతూ కలెక్టరేట్‌కు వచ్చాడు. తాను నరాల బలహీనతతో బాధపడుతున్నానని తనకు సదరం సర్టిఫికెట్‌లో వికలాంగత్వం చూపుతూ సర్టిఫికెట్ ఇచ్చారని కానీ పెన్షన్ రావడం లేదని కోరాడు. ఆమె తల్లితో కలిసి వచ్చిన రిషిత్ తనకు పెన్షన్ ఇప్పించాలని కోరాడు.

జిజిహెచ్‌లో నిధుల దుర్వినియోగంపై అధికారులు స్పందించాలి..

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని దుర్వినియోగ నిధులను రికవరీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ) నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదు ట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ తరచూ అక్రమాలు జరుగుతున్నట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయని, ఆరోగ్యశ్రీ విభాగంలో 10 కోట్లు నష్టం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని కావున వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, మురళి, విఠల్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట మునిపల్లి దళితులు



పింఛన్ కోసం కలెక్టరేట్‌కు వచ్చిన రిషిత్

అక్టోబరుపైనే అందరి ఆశలు..

● ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదల ఎదురుచూపులు ● రేషన్ కార్డుల జారీ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు

మద్నూర్, సెప్టెంబరు 23: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్ కార్డులను అక్టోబరు నెలలో ఇస్తామని ప్రకటించ డంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల చూపు అక్టోబర్‌పై పడింది. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అక్టోబర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పథకాన్ని ప్రారంభించేందుకు నిర్ణయించినట్లు సమా చారం. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు సైతం అక్టోబర్ నెలలో మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వం ప్రకటించ డంతో అందరి ఆశలు అక్టోబర్‌పైనే ఉన్నాయి. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్రంలోని పేద బడుగు, వర్గాలకు సొంతింటిని ని ర్మించి ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. అయితే ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తుండగా ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు. అక్టోబర్ నెలలో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 45 రోజుల్లోగా ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు వేస్తామని జూలై 30న రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భువనగిరిలో ప్రకటించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 నిర్మించి పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. దీంతో మొదటి దశలో ఇందిరమ్మ ఇళ్లను దక్కించుకోవాలని పేదలు ఎదురు చూస్తున్నారు. అదే విధంగా అక్టోబర్ 2 నుంచి కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామన్న ప్రభుత్వం ప్రకటనతో వేలాది మంది బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రేషన్ కార్డుల్లో తప్పొప్పులు సరి చేయాలంటూ గతంలో పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. వీరంతా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అన్నింటికీ రేషన్ కార్డు ప్రమాణం కావడంతో రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. కార్పొరేట్ దవాఖానాల్లో వైద్యం పొందాలన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందాలన్న ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణానికి విద్యార్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఇలా ఏ పథకానికి లబ్ధి పొందాలన్న రేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకుంటున్నారు. దీంతో రేషన్ కార్డు ప్రజలకు అత్యవసరమవుతుంది. వీటిని పొందడానికి మండల రెవెన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. ఇటీవల కొత్త రేషన్ కార్డులు అక్టోబర్ రెండు నుంచి దరఖాస్తులు స్వీకరస్తామని ప్రకటించడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి.



పేదల ఇళ్ల కోసం కేటాయించిన పట్టా భూమి

బాలాజీ జెండాకు భక్తుల పూజలు

మద్నూర్, సెప్టెంబరు 23: మండల కేంద్రంలో బాలాజీ జెండాకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది మహారాష్ట్ర నుంచి తిరుపతి వెళ్లే జెండా మద్నూర్ మండల కేంద్రంలో 11 రోజుల పాటు పూజలు అందుకుంటుంది. అందులో భాగంగా మద్నూర్‌లో గత నాలుగు రోజులుగా బాలాజీ జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమానికి చుట్టూ పక్కల గ్రామాలతో పాటు మండల కేంద్రానికి చెందిన భక్తులు దర్శనానికి వస్తున్నారు. పదకొండు రోజుల పాటు బాలాజీ జెండాకు మండల కేంద్రంలో పూజలు అందుకుంటుందని 30 సంవత్సరాల నుంచి మహారాష్ట్ర నుంచి తిరుపతి వెళ్లే భక్తుడు జెండాను మోసుకొచ్చి మండల కేంద్రంలో పూజలు అందుకుంటున్న అనంతరం తిరుపతికి తీసుకెళ్తారని నిర్వాహకులు తెలిపారు. పదకొండు రోజులలో భాగంగా మహిళలతో కుంకుమార్చన అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు బాలాజీ జెండా దర్శనం చేసుకోవాలని కోరారు.

ఆలయంలో శివలింగ ప్రతిష్ఠాపన

బీర్కూర్, సెప్టెంబరు 23: మండలంలోని బరంగేడ్గి గ్రామంలోని శివలింగేశ్వర ఆలయంలో సోమవారం శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో గణపతి, శివలింగం, నంది విగ్రహాలను ప్రతిష్ఠించారు. కోటగిరికి చెందిన మదన్ విజయ్‌కుమార్ అనే భక్తుడు విగ్రహాలను ఇప్పించారు. శివానందం చారి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 23: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామంలో పంచాయతీ సిబ్బంది సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని వివిధ వార్డుల్లో ప్రస్తుత వర్షాకాలంలో పెరిగిన పిచ్చి మొక్కలను, పొదలు, కూలీలతో తొలగిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు.

అంగన్‌వాడీలో నాణ్యమైన భోజనం అందించాలి

పిట్లం, ఆగస్టు 23: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. సోమవారం రాంపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం, ఉన్నత పాఠశాలను డీఎల్‌పీవో తనిఖీ చేశారు. అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారుల హాజరుపట్టిక, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

నేలకొరిగిన పంటల పరిశీలన

లింగంపేట, సెప్టెంబర్ 23: మండలంలోని పొల్కంపేట, కన్నాపూర్, పోతాయిపల్లి, కోట్‌పల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు నేలకొరిగిన వరి పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్‌తో పాటు ఏఈవోలు పరిశీలించారు. మొత్తం 29మంది రైతులకు చెందిన 42 ఎకరాలల్లో పంట నష్టం జరిగినట్లు వారు తెలిపారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పున:ప్రారంభించాలి

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పునఃప్రారంభించి రైతులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించేలా చూడాలని కార్మికసంఘాల నాయకులు నాగేశ్వర్ రావు డిమాండ్ చేశారు. సోమవారం బోధన్‌లోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులు, కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. లేఆఫ్ అయిన నాటి నుండి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించి ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలన్నారు. వేతనాలు లేక కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇకనైన ప్రభుత్వం స్పందించి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పున:ప్రారంభించి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు బాలకృష్ణ, జల్లయ్య, నయిమొద్దీన్, వికారోద్దీన్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

'వీఆర్‌ఏల వారసులను ప్రభుత్వం ఆదుకోవాలి'

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: రెవెన్యూ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్‌ఏల వారసులు, కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వీఆర్‌ఏ వారసుల బోధన్ డివిజన్ అధ్యక్షులు కరుణాకర్ అన్నారు. సోమవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన వీఆర్‌ఏ వారసుల డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20వేలకు పైగా వీఆర్‌ఏలు ఉండగా అందులో 16వేలకు పైగా వీఆర్‌ఏలకు జీవో 81, 85ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించి మరో 3797మందిని మరిచిందన్నారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులు, కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ప్రభుత్వం తక్షణమే అమలు చేసి ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లాల్లో 400మంది వీఆర్‌ఏలు 61సంవత్సరాలు పైబడిన వారున్నారని వారి వారసులు మరోసారి ఉద్యమించక తప్పదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వీఆర్‌ఏల వారసులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు రత్నకర్, రాజు, శివ, మన్సూర్, లక్ష్మణ్, శ్రీను, హన్మాండ్లు, నర్సింలు, హన్మంతు, పర్వవ్వ, గోపి, సాయికుమార్ పాల్గొన్నారు.

'శాస్త్రీయబద్ధంగా ఆలోచించాలి'

నవీపేట, సెప్టెంబరు 23: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలలతో పాటు స్కాలర్స్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సోమవారం లీప్ సంవత్సరం, మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు విజయానంద రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్రీయబద్ధంగా ఆలోచించి, విద్యార్థులకు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మ్యాజిక్‌ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్కాలర్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు, జనవిజ్ఞాన వేదిక నాయకులు సంజీవ్, రాజశేఖర్, భూమారావు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సన్మానం

నవీపేట, సెప్టెంబరు 23: ఇటీవల మండలంలోని బినోలలో జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో 9బహుమతులు పొందిన జడ్పీహెచ్ఎస్ నాళేశ్వర్ పాఠశాలకు చెందిన క్రీడాకారులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులను పీఈటీ, ఇతర ఉపాధ్యాయులను వీడీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, బినోల సొసైటీ ఛైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్, లక్ష్మణ్, సురేష్ తదితరులున్నారు.

వరిపంటను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారి

నవీపేట, సెప్టెంబరు 23: మండలంలోని సిరన్‌పల్లి, జన్నేపల్లిలలో సోమవారం వరిపంటలను ఏవో నవీన్ కుమార్ పరిశీలించారు. వరిపంటకు సోకిన బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ, కంకినల్లి, మానిపండు తెగులు, కాండం తొలుచు పురుగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఏవో నవీన్ కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రాజాహస, రైతులు సంజీవ రావు, వీరేందర్ రావు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

ఉత్తమ పాఠశాల జాబితాలో లిల్లిపుట్

పెర్కిట్, సెప్టెంబరు 23: రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలల జాబితాలో లిల్లిపుట్ స్కూల్ ఎక్సిలేన్స్ ఆర్మూర్ చోటు చేసుకుందని కరస్పాండెంట్ రామకృష్ణ తెలిపారు. నూతన బోధన మేళకువలు, కాలానుగుణంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా అవలంబిస్తున్న ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఉపకరణాలను ఉపయోగిస్తూ పాఠ్యంశాలను బోధిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా అవార్డు దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసినందుకు గాను ప్రొఫెసర్ అమృత్‌రావు ఎడ్యూకేషన్ సొసైటీ వారికి కరస్పాండెంట్ రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

లక్కోరలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌కు సన్మానం

వేల్పూర్, సెప్టెంబరు 23: వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో సోమవారం నూతనంగా ఎన్నికైన వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డిని కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామాల రైతులకు అన్ని విధాల అండదండగా ఉంటూ సేవలం దించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ చేపూర్ గంగాధర్, మాజీసర్పంచ్ పెద్ద హన్మాండ్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆత్మరాం, చిన్న హన్మాండ్లు, ఆర్మూర్ మోహన్ ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు23: ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వినయ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. అదే విధంగా వినయ్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కలువగా ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నవీపేట, సెప్టెంబరు 23: మండలంలోని అబ్బాపూర్(ఎం)కు చెందిన గైని రుక్మాబాయి (64) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఏఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 20న తన ఇంటికి చెందిన విద్యుత్ సర్వీస్ వైరును కోతులు తెంపివేయగా తెగిపోయిన విద్యుత్ వైరు ఇంటి ముందు వేలాడిందన్నారు. వేలాడుతున్న సర్వీస్ వైరును రుక్మాబాయి పక్కకు తొలగించబోగా ఆమెకు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలపాలైందని అన్నారు. వెంటనే 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతురాలి కుమారుడు పద్మారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇద్దరు దొంగల పట్టివేత

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: బోధన్ పట్టణ శివారులోని రాజీవ్‌గృహ కల్ప వద్ద కిరాణ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగిన ఘటనలో ఇద్దరు దొంగలతో పాటు 5వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆటోనగర్ రాజీవ్‌గృహకల్ప సమీపంలో ఆదివారం రాత్రి తబసుమ్ అనే మహిళకు చెందిన కిరాణ షాపులో దొంగతనం జరిగిందని సోమవారం ఉదయం ఆమె ఫిర్యాదులో పేర్కొందన్నారు. వెంటనే సీఐతో పాటు తమ పోలీసు బృందంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడే అన్ని కోణాల్లో విచారణ చేపట్టి రాజు, రాము అనే ఇద్దరు దొంగలను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 5వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సోమవారం సాయంత్రం దొంగలను కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

తడి,పొడి చెత్తపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ అధికారులు సోమవారం తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు ఆదేశాల మేరకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పలు వార్డులతో పాటు పాఠశాలలో తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించి స్వచ్ఛతాహీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ నర్సయ్య, మున్సిపల్ సిబ్బంది గోపి, ప్రశాంత్, అక్షయ్, రవి, సంతోష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

కోటగిరి, సెప్టెంబరు 23: గత ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతులు మార్కెట్ కమిటీలో దాచుకుంటే ఆ ధాన్యాన్ని మార్కెట్ కమిటీ అధికారులు తిరిగి ఇవ్వకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కోటగిరి మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట సోమవారం రైతులు ఆందోళనకు దిగారు. కోటగిరి మార్కెట్ కమిటీ గోదాములో 48 మంది రైతులు ఏడాది క్రితం ఖరీఫ్ ధాన్యాన్ని సుమారు 2వేల క్వింటాళ్ల ధాన్యాన్ని నిల్వచేశారు. ధాన్యం నిల్వ చేసే సమయంలో రైతులు 40 కిలోల బస్తాలతో కూడిన ధాన్యాన్ని నిల్వచేశారు. ఆ సమయంలో మార్కెట్ కమిటీ అధికారులు ఎలాంటి నిబంధనలు పెట్టకుండా ధాన్యం నిల్వచేశారు. ఆరు నెలల్లోగా ధాన్యం తిరిగి రైతులు తీసుకోవాల్సి ఉండగా అధికారులు పలు కారణాలతో ధాన్యం తిరిగి ఇవ్వలేదు. మరికొంత మంది



ఆందోళన చేస్తున్న రైతులు

రైతులు 40కిలోల బస్తాలతో కూడిన ధాన్యం నిల్వ చేసుకున్నారు. ఆ ధాన్యంపై రుణం తీసుకున్నారు. రుణం చెల్లించి ధాన్యం చెల్లించే క్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు సీఎంఆర్ ధాన్యం పేరుతో ధాన్యం తిరిగి ఇవ్వలేదు. రైతులు కోర్టును ఆశ్రయించి మార్కెట్ కమిటీలో తీసుకున్న రుణం చెల్లించి ధాన్యం తిరిగి తీసుకున్నారు. రుణం తీసుకొని రైతులు మాత్రం తమ ధాన్యం తిరిగి ఇవ్వాలని కార్యాలయం చుట్టు తిరిగిన కార్యదర్శి ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పలు కారణాల పేరుతో కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల ధాన్యాన్ని తిరిగి చెల్లించాలని ఏకగ్రీవ తీర్మానం చేసింది. చెల్లిస్తామని చెప్పిన కార్యదర్శి స్పందించకపోవడంతో మరోమారు రైతులు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోటగిరి తహసీల్దార్ గంగాధర్‌ను ఆదేశించారు. ధాన్యం నిల్వ అంశాన్ని తహసీల్దార్ విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించి ధాన్యం రిలీజ్ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కార్యదర్శి నిర్లక్ష్య వైఖరిపై చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ : ఒకరి మృతి

బోధన్ రూరల్, సెప్టెంబరు 23: బోధన్ మండలంలోని సాలూర, హున్స గ్రామాల మధ్య సోమవారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కొడుకు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సంఘటనకు సంబంధించి బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హున్స గ్రామానికి చెందిన కట్టిగాల సంజీవ్(45) అనే వ్యక్తి తన కుమారుడు అనిల్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై హున్స నుంచి బోధన్ వైపు వస్తుండగా సాలూర మండల కేంద్రం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న స్కార్పియో వాహనం ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాద ఘటనలో తండ్రి సంజీవ్ అక్కడికక్కడే మృతిచెందగా కొడుకు స్వల్ప గాయాలతో బయటపడ్డారన్నారు. మృతుడి భార్య, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్ ఆసుపత్రికి తరలించామన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంజీవ్

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 23: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడలను ప్రొత్సహిస్తూ ఆదరిస్తున్నారని నిజా మాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం జక్రాన్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మూడురోజుల పాటు జరిగే మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా గెలుపొందిన పాఠశాల క్రీడాకారులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి బహుమతులను అందజేశారు. డబుల్ బీటీరోడ్డు, సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరి గిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ గడిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను పట్టించుకోలేదన్నారు. అమ్మ అదర్శ పాఠశాలల కమి టీల ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమేనని, ఓడిన జట్లు భవిష్యత్‌లో జరిగే క్రీడల్లో పాల్గొని మంచి స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి గెలు పునకు కృషి చేయాలన్నారు. మహిళా సంఘాలకు రూ. లక్ష కోట్ల రుణాలను వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసినందున కోటి 25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రధానకార్యదర్శి వసంత్ రావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ఎం.సాయిరెడ్డి, సింగిల్ విండోల ఛైర్మన్‌లు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే

పోషక విలువలపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు23: పట్టణంలోని అశోక్‌నగర్, కాశీహన్మాన్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకవిలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ, గర్భిణీలు, బాలింతలకు తక్కువ ఖర్చుతో కూడిన ఎక్కువ పోషకలు ఉన్న ఆహారం గురించి వివరించారు. అనంతరం ఏడు నెలల పిల్లలకు అన్నప్రసాన, గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్‌లు సీహెచ్.సుజాత, ఎ.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అభినందన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని జిల్లా పరిషత్ రాంమందిర్ పాఠశాలలో క్రీడాకారులను సన్మానించారు. ఇటీవల అర్బన్ మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల్లో కబడ్డీ బాలుర విభాగంలో మొదటి బహుమతి, జూనియర్ వాలీబాల్ విభాగంలో ద్వితీయ బహుమతి, మార్చ్ పస్ట్‌లో కన్సోలేషన్ బహుమతి పొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీఎల్.చలం, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న మినీ స్టేడియం

● పరిశీలించిన అధికారులు



పరిశీలిస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 23: 2024-25 విద్యాసంవత్సరానకు నిర్వహించే మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో నిర్వహించడానికి మండల ప్రధానోపాధ్యాయులు ఇటీవల మండల విద్యావనరుల కేంద్రంలో (ఎమ్మార్సీ) మండలవిద్యాధికారి ఎన్.ఆంధ్రయ్య అధ్యక్షతన అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో తీర్మానించారు. అయితే క్రీడోత్సవాల నిర్వహనకు తమవంతు సహకారం అందజేస్తామని స్థానిక గ్రామాభివృద్ధి కమిటి ముందుకువచ్చింది. మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు సెప్టెంబరు 26, 27, 28 తేదీలలో ముడు రోజులపాటు నిర్వహిస్తామని ప్రకటించారు. మండలక్రీడల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కమ్మర్‌పల్లి హెచ్‌ఎం పసుపుల సాయన్న, స్థానిక పీడీ నాగభూషణం వ్యవహరిస్తారని ఎంఈవో తెలిపారు. కాగా క్రీడల నిర్వహణకు స్థానికంగా ఉన్న మినీ స్టేడియంను ఎంపిక చేశారు ఈ మేరకు సోమవారం ఎంఈవో ఎన్ ఆంధ్రయ్య, స్థానిక పీడీ నాగభూషణం, గ్రామ కమిటీ సభ్యులు గ్రామ యువకులు స్టేడిఎంను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కులకర్ణి సురేష్

వర్ని, సెప్టెంబరు 23 : వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా కులకర్ణి సురేష్ బాబా నియమితులయ్యారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వర్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులుగా మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్, డైరెక్టర్‌లుగా నిమ్మలపూడి పుల్లజీ, మెగావత్ సంతోష్, గౌరారం రమేష్ గౌడ్, షేక్.హైమద్, వేములపల్లి సుధాకర్‌రావు, షేక్.మహబూబ్, పార్వతి, ప్రవీణ్, భట్టు నాగయ్య, లావణ్య, వంగ సాయాగౌడ్, మహేష్, గంగాధర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ ర్యాలీ

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలో విద్యానగర్ కాలనీ నుంచి అంబేద్కర్‌చౌరస్తా వరకు సోమవారం పీడీఎస్‌యూ స్వర్ణోతవ ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ప్రభాకర్‌లు మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల గొంతుక జార్జిరెడ్డి అని, ఎన్నో పోరాటాలు, త్యాగాలను, పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తిచేసుకొని స్వర్ణోత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమం మొదలై రెండు తెలుగు రాష్ట్రాల్లో అంచలంచెలుగా ఎదిగి విద్యార్థుల హక్కుల గొంతుగా పీడీఎస్‌యూ అవతరించిందని వారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు మాజీనాయకులు బి.దేవరాం, పీడీఎస్‌యు నాయకులు కర్క గణేష్, అనిల్‌కుమార్, నిఖిల్, మమత, సిద్దర్ధ, నితిన్, సాయి, వినయ్ పాల్గొన్నారు.

'రెండు లక్షల రుణమాఫీ వర్తించేయాలి'

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలమేరకు ప్రతి రైతు కుటుంబానికి 2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని హసాకొత్తూర్ రైతులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలోని రైతులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు రైతుభరోసా పథకంలో భాగంగా 7 వేల 500 విడుదల చేయాలన్నారు. ఖరీఫ్‌లో పండించే దొడ్డు, సన్నరకం వరికి 5వందల బోనస్ ప్రకటించాలని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలమేరకు ఆరుగ్యారంటీలను అమలు చేయాలని, లేని పక్షంలో రానున్నరోజుల్లో రైతుల అందోళనలు చవిచూడాల్సి వస్తున్నారు. సమావేశంలో చౌట్‌పల్లి సహకారసంఘం ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీధర్, మాజీ ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, గ్రామ రైతులు గడ్డం భూమన్న, సురకంటి రమేష్, ఏనుగు రమేష్, గంగారెడ్డి, గడ్డం రాజేశ్వర్, శంకర్, గంగాధర్, గడ్డం రవి, బంగ్లా శివా, రేవతి ప్రతాప్, పడిగెల అశోక్, గడ్డం రాజన్న పాల్గొన్నారు.

జాలరి వలకు చిక్కిన భారీ చేప

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 23: శ్రీరాంసాగర్ నుంచి వరదకాలువకు నీటి విడుదలతో భారీ చేపలు కొట్టుకువస్తున్నాయి. ఈ మేరకు కమ్మర్‌పల్లికి చెందిన ఊట్నూర్ రాజేష్ ఆదివారం రాత్రి వరదకాలు నీటికి అడ్డుగా వలకట్టడంతో సోమవారం ఉదయం చూడగా వలకు భారీ చేప చిక్కింది. అతి కష్టంమీద దాన్ని ఒడ్డుకు చేర్చాడు. బోత్స రకంచేప అన్నారు.

పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు

డొంకేశ్వర్, సెప్టెంబరు 23 : డొంకేశ్వర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కె టీం ఆధ్వర్యంలో సోమవారం కంటి సమస్యలు ఉన్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కండ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. బరువు తక్కువగా ఉన్న రక్తహీనత ఉన్నత విద్యార్థులకు గుర్తించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేందర్, ఆర్‌బీఎస్‌కె అధికారులు, మమత, పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ఇంటింటి జ్వర సర్వే

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి జ్వరసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ నీటి నిల్వలు ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని, దోమలు వృద్ధి చెంది మలేరియా, ఫైలేరియా, డెంగ్యు వంటి వ్యాధులు వస్తాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడేను డ్రైడేగా కచ్చితంగా పాటించాలని వారు సూచించారు. అర్బన్ యుపీహెచ్‌సీ అధికారి సాయి పాల్గొన్నారు.

కేర్‌టేకర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

ముప్కాల్, సెప్టెంబరు 23: మండల కేంద్రంలోని టీఎస్ఎంఎస్ బాలికల హాస్టల్‌లో కేర్‌టేకర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఈనెల 24నుంచి 26సాయంత్రం వరకు దర ఖాస్తు స్వీకరించబడునని, ఆసక్తి గల వారు స్థానికులైన 35ఏళ్ళ మహిళలు మాత్రమే కంప్యూటర్ పరిజ్ఞానం, డిగ్రీ, బిఈడీ ఉత్తీర్ణులై ఉండా లని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 7731913778నెంబర్‌కు సం ప్రదించాలని తెలిపారు.

పసుపు పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్త

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు23: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో సోమవారం పసుపు పంటలను వ్యవసాయ శాస్త్రవేత్త మహేందర్, ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్యా పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రధాన ఉద్యన పంట అయిన పసుపునకు రైతులు చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పసుపు పంటలో ప్రధానంగా దుంపకుళ్ళ తెగుళ్లు, తాటకు మచ్చ తెగులు, ఆకు ముడత తెగులు, కొన్ని సందర్భాల్లో దుంప ఈగ వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు ముందస్తు చర్యగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దుంపకుళ్లు సోకడం వల్ల కాండంపై నీటితో తడిసిన మచ్చలు ఏర్పడి మెత్తగా మారుతుంది. క్రమేపి దుంపలు కుళ్ళిపోతాయి. ఆకుల, కొమ్మలు మడి ఎండి పోతాయి. దీని నివారణకు రీడోమిల్ రెండు గ్రాములు లేదా క్యాప్టన్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల చుట్టు నెల తడిచేలా మొక్క కాండం వద్ద పిచికారి చేయాలని సూచించారు.

నగరంలో రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

ఖిల్లా , సెప్టెంబరు 23: నగరంలోని ఒకటోటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గల ఇస్లాంపుర ప్రాంతంలో రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖాధికారులు సోమవారం రాత్రి దాడి చేశారు. నగరానికి చెందిన పప్పు అనే వ్యక్తి పెద్దఎత్తున గంజాయి కొనుగోలు చేసి నగరానికి తరలిస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం వద్ద పట్టుబడ్డాడు. అక్కడ పట్టుకున్న అధికారులు జిల్లా కేంద్రంలో ఆయన నివాసం ఉండే ఇంట్లో సైతం అక్రమ గంజాయి నిలువ ఉంటుందనే అనుమానంతో ఇంటిలో సోదాలు నిర్వహించారు.

రోడ్డు కబ్జా చేసిన వ్యక్తిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

భీమ్‌గల్, సెప్టెంబరు23: పట్టణ కేంద్రంలోని పదోవార్డులో రోడ్డు కబ్జా చేసి గోడ నిర్మించిన ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతి పత్రం అందజేశారు. కాలనీలో తాగునీటి అవసరాల కోసం తమ పూర్వీకుల నుంచి ఉన్న బావిని ఇజ్రాయిల్ అనే వ్యక్తి అక్రమంగా కూల్చివేసి గోడను నిర్మించి చర్చిని నడుపుతూ తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఈ విషయమై 31అక్టోబర్ 22న మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా అట్టి గోడను వారం రోజుల్లో తొలగించాలని నోటీసులు జారీ చేశారని, అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్‌కు తెలిపారు. రోడ్డును కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోని మంచినీళ్ళ బావిని రోడ్డును పునరుద్ధరించాలని కోరారు.

మహాలక్ష్మీ గ్యారంటీ పత్రాలు అందజేత

భీమ్‌గల్, సెప్టెంబరు 24: పట్టణ కేంద్రంలోని 5, 6వార్డులలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నాగేంద్ర ఆధ్వర్యంలో సోమవారం మహాలక్ష్మీ పథక లబ్ధిదారులకు గ్యారంటీ మంజూరు పత్రాలను అందజేశారు. మహిళపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు రూ.500లకే మహాలక్ష్మీ పథకం ద్వారా వంట గ్యాస్ సిలిండర్ అందించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని స్వామి నాగేంద్రలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు సురేష్, మొండి చరణ్, 5, 6వార్డుల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు వాటర్ ట్యాంకు వితరణ

ముప్కాల్, సెప్టెంబరు 23: ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు 6వ తరగతి చదువుతున్న అశ్విత తండ్రి రాజేందర్ 500 లీటర్ల వాటర్‌ట్యాంకు సోమవారం పాఠశాలకు వితరణ చేశారు. పిల్లలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న తెలుసుకొని వాటర్ ట్యాంకును అందజేసినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వినోద రాజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, దాత రాజేందర్ పాల్గొన్నారు.

బాల్కొండ పాఠశాలకు కుర్చీల వితరణ

ముప్కాల్, సెప్టెంబరు 23: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం పూర్వవిద్యార్థులు రామకృష్ణ 21 కుర్చిలను అందజేశారు. పాఠశాలలో కుర్చిల కొరతను గమనించిన రామకృష్ణ తనవంతు సహాయంగా పూర్వవిద్యార్థులు రహీమొద్దిన్, రాజేందర్‌లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్, త్రీఫేజ్ మోటార్లను వినియోగించాలి

కోటగిరి, సెప్టెంబరు 23: గ్రామాలలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన సింగిల్, త్రీఫేజ్ మోటార్లను సమర్థవంతంగా వినియోగించాలని బోధన్ మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్ సూచించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. తొలిరోజు సింగిల్ ఫేజ్, త్రీఫేజ్‌ల మోటార్ల వినియోగంపై అవగాహన కల్పించారు. సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్‌లలో విద్యుత్ వైర్లు, ఓల్టేజీ, పవర్‌డెవలరీ, విద్యుత్ అంతరాయంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా కంటే త్రీఫేజ్ మోటార్ సప్లై సమర్థవంతంగా పని చేస్తుందని వివరించారు మోటార్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ తాగునీరు వృధా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్‌ల లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలని, సమస్య తీవ్రంగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ డీఎల్‌పీవో మధుకర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏఈ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

శేషాద్రి ఫారంలో 10 ట్రిప్పుల ఇసుక డంప్ సీజ్

కోటగిరి, సెప్టెంబరు 23: పొతంగల్ మండలంలోని హెగ్డోలి పంచాయతీ పరిధిలో గల శేషాద్రిఫారం, సుంకిని గ్రామాల మధ్య రహస్యంగా డంప్ చేసిన ఇసుక డంప్‌ను తహసీల్దార్ మల్లయ్య సీజ్ చేశారు. సుంకిని గ్రామం నుంచి కొందరు అక్రమార్కులు ట్రాక్టర్లలలో సుమారు 10ట్రిప్పుల ఇసుకను డంప్ చేసినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు ఇసుక డంప్‌ను సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. ఇసుక అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంటపొలాల పరిశీలన

బోధన్ రూరల్, సెప్టెంబరు 23: బోధన్ మండలంలోని పెంటాఖుర్దు క్యాంప్, కుమ్మన్‌పల్లి, సాలంపాడ్ క్యాంప్ గ్రామాలలోని వరిపంటలను సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. వరిపంటకు ఆశించిన బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు, సుడి దోమ ఆశించిన పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏఈవో సాయిచరణ్ మాట్లాడుతూ రైతులు వరిపంట పొలాల్లోని సుడిదోమ నివారణకు డైనోటెస్ట్యూరన్ 80గ్రాములు లేదా ఫైమెట్రోజైన్ 120 గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పిచికారి చేసే ముందు పంట పొలాల్లోని నీటిని తీసివేయాలన్నారు. బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు నివారణకు పొంటామైసిన్ 80గ్రాములు, అగ్నిమైసిన్ 80గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. రైతులు తమ పంట పొలాలను సుడిదోమ నుంచి కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో బోధన్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, రైతులు వెంకటేశ్వర్ రావు, రాజా, శ్రీకాంత్, సుబ్బారెడ్డి తదితులు పాల్గొన్నారు.

పేదలకు, వికలాంగులకు దుప్పట్ల పంపిణీ

బోధన్‌రూర్యాల్, సెప్టెంబరు 23: బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో పేదలు, వృద్ధులకు, వికలాంగులకు, అంధులకు సోమవారం వాసవీ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ శాంతిశ్రీ మాట్లాడుతూ వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నిరుపేదలకు ఎప్పుడు అండగా ఉంటుందని, వాసవీ క్లబ్ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ డాక్టర్ సూర్యరావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మహజన్ రాణి, వ్యాపారవేత్త ప్రకాష్ గుప్తా, కంటాల రమేష్, బిల్లకంటి అనిల్, రామకృష్ణ, గంగాధర్, లయన్స్ ప్రతినిధులు గబాలే జయశ్రీ, సీహెచ్.పద్మ, వాసవీక్లబ్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన నాయకులు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 23: బోధన్ సబ్‌కలెక్టర్‌ను సోమవారం బోధన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకు సంధ్యదాము, వైస్ ఛైర్మన్ చీల శంకర్‌లతో డైరెక్టర్‌లు సబ్‌కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకుసంధ్య దాము మాట్లాడుతూ బోధన్ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని సందర్శించాలని, రైతులకు, మార్కెట్ కమిటీకి సహాయ, సహకారాలు అందిస్తూ రైతులకు పలు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 23: కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నాగాపూర్ గ్రామానికి చెందిన పాలెపు నర్సయ్యను ప్రభుత్వం ప్రకటించడంతో సోమవారం కమ్మర్‌పల్లిలో మండల ఆర్య వైశ్య సంఘం సభ్యులు నూతన ఛైర్మన్ పాలెపు నర్సయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం సభ్యులు ఆమెడ డిష్ నరేందర్, ఆమేటి శంకర్, నీలి వేణుగోపాల్, మర్యాల నాగభూషణం, జొన్నల భూషన్ ఉన్నారు.

ప్రజలను మోసగిస్తున్న వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

తాడ్వాయి, సెప్టెంబరు 23: అమాయక ప్రజలను ఎంచుకుని క్షుద్ర పూజలు చేస్తే డబ్బులు వస్తాయని మాయమాటలు చెప్పి మోసగిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన ఫైడాకుల తిరుపతి అతని భార్య స్వప్నలు మోసగించేందుకు పథకం వేసి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్, సాయిలు, హైదరాబాద్‌కు చెందిన జమాల్పుర్ సాయికుమార్‌లతో కలిసి మహిళను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులను వసూలు చేశారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మోసం చేసేందుకు ప్రయత్నించిన ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. ప్రజలు ఇలాంటి వారి భారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ సంతోష్‌కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు రక్తహీనతపై అవగాహన

దోమకొండ, సెప్టెంబరు 23: మండలంలోని అంబార్‌పేట,పలుగడ్డ జిల్లా పరిషత్ పాఠశాల, బీబీపేట మండలంలోని యాడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల కిశోర, బాల బాలికలకు వెర్వేరుగా కౌమారదశ శిక్షణలో బాగంగా సోమవారం వర్డ్ ఉమెన్ ఆర్గనైజేషన్‌ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ కామారెడ్డి డివిజనల్ మానిటరింగ్ కో ఆర్డినేటర్ ఎస్. రాణి అవగాహన కల్పించారు. కౌమార దశ గల బాల బాలికల లైంగిక వ్యాధులు, హెచ్ఐవీ ఎయిడ్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రక్తహీనత, పౌష్టికాహారం, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు శ్రీవిద్య, వంశీక్రిష్ణా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సేవా మహా యజ్ఞ కార్యక్రమం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 23: కామారెడ్డి పట్టణంలోని రుక్మిణికుంటలోని మైసమ్మ ఆలయంలో సోమవారం బీజేపీ నాయకులు స్వచ్ఛసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని సేవా మహాయజ్ఞ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు బీజేపీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదేశాలమేరకు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. 25న మెగా సభ్యత్వనమోదు, ఆరోగ్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్‌జైన్, ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు వేణు,శ్రీనివాస్,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'నేర నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి'

సదాశివనగర్, సెప్టెంబరు 23:నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్ఐ రంజిత్ తెలిపారు. అమర్లబండలో నేరాల నియంత్రణపై సోమవారం రాత్రి అవగాహనకల్పించారు. గ్రామాలలో చిన్నచిన్నతగాదాలకు అవకాశం లేకుండా ప్రతి ఒక్కరు సంయమనం పాటించి సమస్యను జటిలం చేయకుండా పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. సీసీకెమెరాలు ఏర్పాటు తప్పకుండా చేసుకోవాలని ఇందుకోసం దాతలు సహకారం అందించాలని కోరారు.

'రేషనలైజేషన్ జీవో 25 నిబంధన మార్చాలి'

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 23: రేషనలైజేషన్ జీవో 25 నిబంధనలను మార్చాలని, అశాస్త్రియమైన సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలలవైపు ఆకర్షించాల్సి ఉండగా అశాస్త్రీయంగా జీవో 25 అమలుకు పాఠశాల విద్యాసంచాలకులు జీవో జారీ చేయడాన్ని ఖండిస్తున్నామని అ న్నారు. ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు,అదేవిధంగా 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం అసంబద్ధమైనదని తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుండే విధంగా 40 మందివరకు ఇద్దరు. 60మంది వరకు ముగ్గురు, ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని చొప్పున కేటాయించాలని అన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

ఇసుక పాయింట్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



చించోల్లిలో ఇసుక పాయింట్ పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బీర్కూర్, సెప్టెంబరు 23: బీర్కూర్ మండలం చించోల్లి గ్రామ సమీపం లోని మంజీరా నదిలో ఇసుక పాయింట్‌ను సోమవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. ఇసుకకు అనుమతులు ఇప్పించాలని పలువురు సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ చించోల్లికి విచ్చేసి ఇసుక పాయింట్‌ను పరిశీలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఇసుక కొరత వల్ల డబుల్ బెడ్ రూమ్‌లు, ఇతర కట్టడాలు, అబివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఇసుకకు అనుమతులు ఇప్పించాలని ఇళ్ళు నిర్మించుకుంటామని ఆమెతో విన్నవించుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ లత, సిబ్బంది తదితరులున్నారు.

కామారెడ్డిలో ప్రముఖ

హాస్య నటుడు బ్రహ్మానందం సందడి

● బాంబే క్లాత్ హౌస్‌ను ప్రారంభించిన బ్రహ్మానందం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 23: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ప్రముఖ హాస్య నటుడు బ్ర హ్మానందం శుక్రవారం సందడి చేశారు. నిజాంసాగర్‌చౌరస్తా సమీపంలో ఏర్పాటుచేసిన బాంబేక్లాత్‌హౌస్ నూతన ఫ్యామిలీ స్టోర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజల మనస్సును చూరగొన్న బాంబే క్లాత్ హౌస్ మరో షోరూంను ప్రారంభించి ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు సిద్ధమైందన్నారు. క్లాత్‌హౌస్ నిర్వాహకులు సేవ కార్యక్రమాలలో సైతం ముందుంటూ ప్రజలకు ఎనలేని సేవలు చేయడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు దరిచేరడమే కాకుండా బాంబే క్లాత్ షో రూంలు మరిన్ని చోట్ల పెట్టేలా దినదినాభివృద్ధి చెందాలని ఆశీస్తున్నానన్నారు. తన అభిమాని హర్ష పిలుపు మేరకు స్టోర్ ప్రారంభానికి కామారెడ్డికి వచ్చానని ఇలాగైనా ఈ ప్రాంతాన్ని దర్శించుకునే అవకాశం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, బాంబే క్లాత్‌హౌస్ షోరూం నిర్వాహకులు వీటిలాల్, వీటి రాజ్‌కుమార్, మేనేజర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

● తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం చైర్‌పర్సన్ కల్వ సుజాత



ఎల్లారెడ్డిలో ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 23 : ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం చైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ముత్యపు రాఘవులు కల్యాణ మండపంలో కామారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా ముత్యపు సుదర్శన్, ఉపాధ్యక్షులు ముప్పిడి హరి నారాయణ, కోశాధికారి రాజులు, సహాయ కోశాధికారి శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ సుధాకర్, పీఆర్‌వోలు కొండ శైలేందర్ గుప్త, రమేష్‌లతో పాటు కార్యవర్గ సభ్యులందరితో ఆమె ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కైలాష్ శ్రీనివాస్, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్ర పాల్ పాల్గొన్నారు.

కామారెడ్డి డివిజన్ అధ్యక్షుడిగా బాశెట్టి నాగేశ్వర్

దోమకొండ : ఆర్యవైశ్య మహాసభ కామారెడ్డి డివిజన్ అధ్యక్షుడిగా బాశెట్టి నాగేశ్వర్, జిల్లా కార్యదర్శిగా ప్రసాద్, కార్యవర్గసభ్యునిగా తాటిపల్లి రమేష్, సేవాదళ్ ఉపాధ్యక్షులుగా పబ్బ యాదగిరిని ఎన్నుకున్నారు.

గ్రామాల్లో ఆటంకం లేకుండా నాణ్యమైన మంచినీటిని అందిస్తాం



జుక్కల్‌లో మాట్లాడుతున్న మిషన్ భగీరథ ఎస్ఈ రాజేందర్

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 23: రానున్న రోజులలో జుక్కల్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మం డలాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి నాణ్యమైన తాగు నీటిని అందజేస్తామని మిషన్ భగీరథ ఎస్ఈ రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం జుక్కల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులకు అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రాజేందర్ మాట్లాడుతూ గ్రామాలలో నీటి సరఫరాలో తరచూ కలుగుతున్న అంత రాయం దృష్ట్యా గ్రామం నుంచి ఒక మంచి నీటి సహాయకులకు ఎంపిక చేసి వారికి 4 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు నీటి నాణ్యత అంశంపై, రెండో రోజు పైపులైన్ జాయిటింగ్, మూడోరోజు పంపు సెట్ రిపేర్, నాలుగో రోజు చేతిపంపుల రిపేర్ తదితర కార్యక్ర మాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయితీలో ఉండే ఒక మల్టిపర్పస్ వర్కర్‌ను ఎంపిక చేసి ఈ శిక్షణ అందజేస్తు న్నామని తెలిపారు. శిక్షణ అనంతరం గ్రామాలలో మంచినీటి సహాయకులు నీటి సరఫరా సజావుగా జరిగేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం జుక్కల్ మండలంలో కొనసాగుతున్న శిక్షణ తరగతులు విడతల వారీగా నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ కౌషిక్, ఎంపిడివో శ్రీనివాస్, ఏఈఈ ఆర్‌డబ్ల్యుఎస్ నయీం, ఎంపివో రాము, శిక్షకులు విఘ్నేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తల కుటుంబాలను

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 23 : ఎల్లారెడ్డి మండ లంలోని కొక్కొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సూరయ్య తండ్రి మల్లయ్య గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకు న్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం మృతుడి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వేళలా తాను మీకు అండగా ఉంటానని ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మహ్మద్ ఫహీం అనారోగ్యంతో కొన్ని రోజుల క్రితం మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి మృతుడు ఫహీం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్య క్షుడు జలంధర్‌రెడ్డి, నాయకులున్నారు.

'మహిళా సంఘాలలో లేని వారిని చేర్పించాలి'

రాజంపేట, సెప్టెంబరు 23: రాజంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం డీపీఎం సుదాకర్ ఆధ్వర్యం లో మండల మహిళ సమాఖ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మహిళ సంఘాలల్లో లేని సభ్యులను సంఘంలో చేర్పించాలని అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ ఇప్పించాలని సోలార్‌యూనిట్ అవగాహన కల్పించాలని తెలిపారు. కుట్టుమిషన్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని పీఎం ఎఫ్ఎం కింద ఫుడ్ ప్రాసెస్ యూనిట్‌ను ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి లావణ్య, ఏపీఎం సాయిలు, గ్రామ సంఘం అధ్యక్షుడు, వీపీఏలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్ వీరునికి సన్మానం



అగ్నిపథ్ వీరున్ని సన్మానిస్తున్న కోడ్చిర గ్రామస్తులు

మద్నూర్, సెప్టెంబరు 23: ఉమ్మడి మద్నూర్ మండలంలోని కోడ్చిరా గ్రామానికి చెందిన డోయిని వార్ గంగామణి సాయిలు కుమారుడు బోయి నివార్ రమేష్ అగ్నిపథ్‌లో చేరి సంవత్సరం పాటు పారాయస్ఎఫ్ కమాండెంట్‌గా శిక్షణ పొంది తిరిగి గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు ఆయనకు సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంగమేశ్వర్ మాట్లాడుతూ దేశ సేవలో తమ గ్రామస్తుడు చేరి సరిహద్దులో దేశ భద్రత కోసం విధులు నిర్వహించడం ఆ గ్రామానికి గర్వకారణమని అన్నారు. పారా ఎస్ఎఫ్ కమాండెంట్ రమేష్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ తమ కుమారుడిని దేశ రక్షణ కోసం పంపించడంపై గ్రామస్తులు తల్లిదండ్రు లను అభినందించారు. దేశ సేవలో ప్రతీ ఇంటి నుంచి ఒక యువకున్ని పంపే విధంగా తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణా గౌడ్, మాజీ సర్పంచ్ సంతోష్, గ్రామస్తులు ప్రకాష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగారాం

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 23: కొద్ది రోజుల కిందట పెద్ద కొడప్‌గల్ గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు గొండ మోహన్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం గొండ మోహన్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగారాం మాట్లాడుతూ మోహన్ మృతి బీజేపీకి తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చిప్ప రమేష్, తానాజీ, ప్రేమ్ సింగ్, శ్రీనివాస్ గౌడ్, చాకలిసాయి, రమేష్ పాల్గొన్నారు.

వాటర్‌మెన్‌లకు శిక్షణ శిబిరం ప్రారంభం

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 23 : మండలంలోని గ్రామ పంచాయితీల వాటర్‌మెన్‌లకు నాలుగు రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. మండలంలోని మాల్తుమ్మెద రైతు వేదికలో ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

గ్రామాల్లో పారిశుధ్య

నిర్వహణపై దృష్టి సారించండి

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 23: గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించి పారిశుద్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయితీ కార్యదర్శి సూచించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రతిరోజు గ్రామంలో ఒక కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామంలో ర్యాలీ నిర్వహించి కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించామని తెలిపారు. అంతకు ముందు గ్రామస్తుల సహకారంతో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి భరత్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



మంత్రి సీతక్కకు నిధులు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 23: వెనుకబడిన ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనరి పలు అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సోమవారం రాష్ట్ర సచివాలయంలో కలిసి ప్రతిపాదనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తన నియోజకవర్గంలోని అంగన్వాడీలకు, నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, మరమ్మతులు, గ్రామాల గిరిజన తండాల రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం సుమారు 244 కోట్ల రూపాయల నిధులు కోరుతూ ప్రతిపాదనలు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిధుల విడుదలైన మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పార్టీ సభ్యత్వాన్ని పకడ్బందీగా చేపట్టాలి

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 23: జిల్లాలోని కామారెడ్డి,ఎల్లారెడ్డి,బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలలోని మహిళా అధ్యక్షురాలు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వంను పకడ్బందీగా చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి అన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణంలో మెంబర్‌షిప్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండలంలోని గ్రామగ్రామాన, పట్టణాలలోని ప్రతీ వార్డులలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మహిళల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తు కాంగ్రెస్ మహిళ మెంబర్‌షిప్‌ను చేపట్టాలని తెలిపారు. పార్టీ బలోపేతానికి మహిళా కార్యవర్గ సభ్యులు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

నేడు రైతు నేస్తం

మద్నూర్, సెప్టెంబరు 23 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీ మంగళవారం రైతుల కోసం రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా నేడు ఉమ్మడి మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు సలహాలు, సూచనలు అందజేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. రైతులు పండిస్తున్న పంటలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని అందులో భాగంగా నేడు సాగుపై అవగాహన ఉంటుందని, అదే విధంగా రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తారని తెలిపారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

● మృతురాలి భర్త, అతని స్నేహితుడి అరెస్ట్



నిందితులు గంగాధర్‌గౌడ్, సతీష్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో రంగరాణి (32) అనే వివాహిత భర్త వేదింపులు తట్టుకోలేక ఆత్మహత్యా యత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రాజంపేట గ్రామానికి చెందిన గంగాధర్ గౌడ్‌తో నిజామాబాద్‌కు చెందిన రంగారాణికి 9 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారిద్దరికి ఇద్దరు కొడుకులు. తరచూ భర్త అదనపు కట్నం కోసం రాణిని శారీరకంగా, మానసికంగా వేధించేవాడని, ఆ తర్వాత అతనితో పరిచయం ఉన్న వైజాగ్‌కు చెందిన సతీష్‌ను తీసుకుని వచ్చి ఇంట్లో ఉంచాడు. ఇద్దరు రాణిని వేధిస్తూ చేతులతో, కర్రతో కొట్టడంతో ఈ నెల 6న తనతల్లిగారింటికి వెళ్లిన రాణి తండ్రి రాజేశ్వర్‌గౌడ్‌కు వివరించింది. తీవ్ర మానసిక వేదనకు గురైన రాణి అదే రోజు పొలంలో పురుగుల మందు కలుపుకుని తాగగా నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబీకులు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి మెరుగుపడక పోవడంతో ఈనెల 21న నిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. తన కూతురు మృతికి కారణమైన రాణి భర్త గంగాధర్ గౌడ్, సతీష్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి రాజేశ్వర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఇరువురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మాదక ద్రవ్య రహిత తెలంగాణ కోసం సహకరించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 23:మాదక ద్రవ్య రహిత తెలంగాణ కోసం అందరూ సహకరించాలని ఇంపాక్ట్ ఇంటర్‌నేషనల్ సంస్థ సర్టిఫైడ్ ట్రైనర్ రమేష్‌చైతన్య అన్నారు. సోమవారం ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల వచ్చే అవరోదాలు, మితిమిరిన సోషల్‌మీడియా వాడకం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు ముందు సరదాకోసం ప్రారంభించి ఆ తర్వాత ఆ ఊబిలో నుండి బయటకు రాలేక అటు మానసికంగా సామాజికంగా సమస్యలను ఎదుర్కోంటారనితెలిపారు. ఒక్కోసారి ఆత్మహత్యలకు,మానభంగాలకు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా సోషల్‌మీడియాను అవసరం మేరకు తప్ప తమ విలువైన సమయాన్ని వెచ్చిస్తే మానసిక,శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

